ఆశాజనకంగా మొక్కజొన్న

- దిగుబడిపై రైతుల ఆనందం
- మార్కెట్‌లో మంచి ధర

సీతానగరం: మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర కూడా పలుకుతోంది. సాగునీరు పుష్కలంగా ఉండటంతో మొక్కజొన్న మంచి దిగుబడి సాధించింది. గ్రామాల్లో రబీలో వేసే ఆరుతడి పంటలలో మొక్కజొన్న ప్రధానమైనది. మండలంలో సుమారు 9 వేల ఎకరాల్లో దీన్ని సాగు చేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ నెలాఖరు నుంచి మొక్కజొన్న పంట సాగు చేసి, మార్చి నుంచి అమ్మకాలు జరిపారు.

పుష్కలంగా సాగునీరు

గత టీడీపీ ప్రభుత్వంలో రబీలో వేసే ఆరుతడి పంటలకు తొర్రిగడ్డ స్కీమ్ నుంచి సాగునీరు అంతంత మాత్రంగా అందించేవారు. దీంతో సాగునీటి ఎద్దడి ఏర్పడి పంట అనుకున్న దిగుబడి వచ్చేది కాదు. ఖరీఫ్‌లో జూలై నెలాఖరున తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీరు విడుదల చేసేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఖరీఫ్‌కు నెల రోజుల ముందుగానే జూన్ మొదటి వారంలో సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఖరీఫ్‌లో వేసే వరి ఆకుమడుల నుంచి పంట పూర్తయ్యే వరకూ నీరు సమృద్ధిగా అందిస్తున్నారు. రబీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరుతడి పంటలకు సాగునీటికి ఎకరానికి కొంత నగదును వసూలు చేసేవారు. అయినా సరిపడినంత ఇచ్చేవారు కాదు. దీనికి భిన్నంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రెండో పంటకు పుష్కలంగా సాగునీరు అందించడంతో రైతులు మొక్కజొన్న పంట మంచి దిగుబడి సాధించారు.


రఘుదేవపురంలో ఆరబెట్టిన మొక్కజొన్న

లాభాల బాటలో..

రబీలో వేసిన మొక్కజొన్న పంట మంచి దిగుబడి సాధించింది. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి, శిస్తుగా రూ.15 వేల వరకూ చెల్లించారు. ఎకరానికి దిగుబడి 35 క్వింటాళ్ల నుంచి 42 క్వింటాళ్ల వరకూ వచ్చింది. ఫిబ్రవరిలో క్వింటాల్ మొక్కజొన్న రూ.2,200 ఉండగా, ఆ సమయంలో రైతులకు అరకొర మాత్రమే మొక్కజొన్న అమ్మకాలు జరిపారు. మార్చిలో క్వింటాల్ రూ.2050 ఉండగా రైతులు అధిక శాతం అమ్మకాలు జరిపారు. అనంతరం కురిసిన వర్షాలకు మొక్కజొన్న ధర ఒక్కసారిగా రూ.1,750 తగ్గింది. దీనితో రైతులు అమ్మకాలు జరిపినా లాభాలు సాధించారనే చెప్పవచ్చు

లాభం వచ్చింది



ఆరు ఎకరాల్లో ఈ పంట సాగు చేశాను. ఎకరానికి 38 క్వింటాళ్ల దిగుబడి లభించింది. ధర బాగుండడంతో లాభం వచ్చింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు పంటలకు పుష్కలంగా తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీరు అందిస్తున్నారు.

– మద్దంశెట్టి గాంధీ, వంగలపూడి, కౌలురైతు

దిగుబడి బాగుంది



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. నీరు పుష్కలంగా ఉండటంతో దిగుబడి బాగా వచ్చింది. మంచి ధరకు అమ్మకాలు జరిపాను. లాభం వచ్చింది. సాగునీరు పుష్కలంగా అందించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు రుణపడి ఉంటాం.

– ఎస్. దుర్గారావు, లంకూరు, రైతు

క్రీడలతో ఉన్నత భవిష్యత్తు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జాతీయ హాకీ క్రీడాకారిణి లక్ష్మీప్రసన్నకు సత్కారం

పెదపూడి: విద్యార్థులకు క్రీడలతో ఉన్నత భవిష్యత్ సాధ్యమవుతుందని, అందుకే చదువుతో పాటు క్రీడలపైనా దృష్టిసారించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఒడిశాలోని రూర్కెలాలో ఇటీవల జరిగిన 13వ ఆలిండియా హాకీ ఉమెన్ సబ్‌జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ప్రతిభ కనబరిచిన రామేశ్వరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని రాపర్తి లక్ష్మీ ప్రసన్నను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. రామేశ్వరం గ్రామంలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థిని లక్ష్మీప్రసన్న, ఆమె కోచ్ వి.రవిరాజులను దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మీప్రసన్న ఆలిండియా హాకీ ఉమెన్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో లీగ్ దశలో రాష్ట్రం తరపున మూడు మ్యాచ్‌లు ఆడిందన్నారు. పంజాబ్ జట్టుతో జరిగిన మ్యాచ్ డ్రా కాగా, మణిపూర్, గుజరాత్ జట్లుపై విజయం సాధించిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో రాణిస్తున్న లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. లక్ష్మీప్రసన్న మరిన్ని పోటీల్లో విజేతగా రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంత, ఆలయ కమిటీ చైర్మన్ గంగ ముళ్ల సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ కె. వరలక్ష్మి, కొటికలపూడి గణేష్, కె.గోపి, దూళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


రామేశ్వరంలో హాకీ క్రీడాకారిణి లక్ష్మీప్రసన్నను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పేదలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

అనపర్తి: ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేస్తున్న ఇళ్ల స్థలాలపై అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలని పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలాలను కేటాయిస్తోందని చెప్పారు. పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు ప్రతిపక్షాలకు రుచించడం లేదని, అందుకే పేదల ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వమిచ్చే స్థలం శవాల్ని పూడ్చడానికి సరిపోతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేశారన్నారు. చంద్రబాబు అహంకారానికి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమావేశంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురునాగు, సచివాలయ కన్వీనర్ కండిపల్లి సత్తిబాబు, నాళం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రొంగల అప్పాజీ

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

బిక్కవోలు: పేదల సొంతింటికి ప్రభుత్వమిస్తున్న భూమిపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం స్థానిక లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నేతలు బిక్కవోలులో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ బిక్కవోలు–జి.మామిడాడలో ప్రభుత్వం సుమారు 700 మందికి ఇంటి స్థలాలిచ్చిందని, వాటిలో చాలా మంది ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ఘనత జగనకే దక్కుతుందన్నారు. చంద్రబాబు మతిస్థిమితం సరిగా లేదని, ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, సర్పంచ్ సరెళ్ల సుమలత, పోతుల ప్రసాద్ రెడ్డి, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో మాజీ సీఎం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న స్థానిక నేతలు

అకాల వర్షం.. కూలిన చెట్లు


గాదరాడలో చెట్టుపడి ధ్వంసమైన ట్రాక్టర్


నర్సాపురం - గాదరాడలో రోడ్డులో కూలిన చెట్లు

మధురపూడి: కోరుకొండ మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుసింది. గాదరాడ గ్రామంలోని గొడ్డు చంద్రరావు ట్రాక్టర్‌పై చెట్టు పడిపోయింది. ఈ ఘటనలో ఇంజిన్ పూర్తిగా ధ్వంసమైంది. ఇంటి సమీపంలోని చెట్టుకింద ఉంచగా ఈ ఘటన జరిగింది. నర్సాపురం – గాదరాడ రోడ్డులో చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీరంగపట్నం బీసీపేటలో రేకుల షెడ్డు ధ్వంసమైంది. కిరాణా షాపుపై నున్న రేకుతో సహా ఎగిరిపోయింది. ఎస్సీపేటలోని బొమ్మూతి వెంకటేశ్వర్లు తాటాకు పాకపై చెట్టుకొమ్మలు పడ్డాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో గురువారం మధ్యాహ్నం 4 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వంగలపూడి తదితర గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. చినకొండేపూడి – పెదకొండేపూడి రోడ్డులో చెట్లు పడిపోయాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురుగాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

వర్షంతో ఉపశమనం

రంగంపేట: రోహిణి కార్తె ప్రారంభంతో గురువారం అత్యధికంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రానికి వాతావరణం కాస్త చల్లబడడంతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. మండలవ్యాప్తంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా పామాయిల్, జీడి మామిడి, నిమ్మ తోటలతో పాటు కూరగాయ పంటలకు మేలు చేకూరిందని రైతులంటున్నారు.


చినకొండేపూడి - పెదకొండేపూడి రోడ్డులో కూలిన చెట్లు


విరిగిపోయిన స్తంభాలు

ఈదురు గాలులతో నష్టం

రాజానగరం: ఈదురుగాలుల కారణంగా మామిడి, జీడి మామిడి రైతులతో పాటు విద్యుత్‌శాఖకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కలవచర్ల ఫీడర్ పరిధిలో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి, మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు సుమారు రెండున్నర గంటల పాటు అంతరాయం ఏర్పడింది. ఏఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది హుటాహుటిన ఆయా ప్రాంతాలకు చేరుకుని, తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేశారు. విరిగిపోయిన స్తంభాల స్థానే కొత్తవాటిని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తుంగపాడు, తోకాడ, మల్లంపూడి, రాధేయపాలెం, భూపాలపట్నం గ్రామాల్లో మామిడి, జీడి మామిడి తోటలకు ఈదురు గాలులు నష్టాన్ని చేకూర్చాయి.

సంపత్‌నగరంలో రూ.5.50 కోట్లతో అభివృద్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..

రాజానగరం: మండలంలోని సంపత్ నగరం గ్రామంలో రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఏ మేరకు అందుకున్నారు, ఎక్కడైనా సమస్యలు ఎదురయ్యాయా అని ఆరా తీశారు. సీఎం జగన్ పాలనలో అందరికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్నామన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఈ గ్రామంలో రూ. 5.50 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరిగితే గత టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.17.39 లక్షలు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. తమ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 6,79,83,418తో 2,966 మందికి ప్రయోజనం చేకూర్చిందన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఇంతవరకూ ఇంత మొత్తంలో కేటాయించిన ప్రభుత్వాలు, పాలకులు లేరనే విషయాన్ని గ్రహించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరొక అవకాశం ఇవ్వాలని కోరారు.


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సమస్యల పరిష్కారం దిశగా..

పోలియోతో బాధపడుతున్న బావిశెట్టి పుష్పవాణితో మాట్లాడి ఆమె సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. ఆమె కోరిక మేరకు కుట్టుమెషీన్ అందించేలా చర్యలు తీసుకున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న 65 ఏళ్ల తన భార్యకు పింఛను ఇప్పించాలని 70 ఏళ్ల కోటి వీర్రాజు కోరిక మేరకు, పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో 248 మంది ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని, వాటిలో 98 మందికే పట్టాలు ఇచ్చారని, మిగిలిన వారికి కూడా ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని స్థానికులు కోరారు. త్వరలోనే పట్టాల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, పుణ్యక్షేత్రం సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక అమ్మిరాజు, నాయకులు లంక ఆదినారాయణ, మాచారావు, మురళి, వెంకన్న, రాయుడు పాల్గొన్నారు.

మానవ సంబంధాలపై అవగాహన

రాజానగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు ఇస్తున్న వేసవి శిక్షణ తరగతులు గురువారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిక్షణ తరగతులలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, నీతి పద్యాలు నేర్పించడం, చెప్పించడం, తెలుగు పదాలు నేర్పడం, పేపరుతో క్రాఫ్ట్స్ (బొమ్మలు, ఇతర వస్తువులు) తయారు చేయించడం, చిన్న పిల్లలకు తెలుగు అక్షరాలు నేర్పించడం వంటి అనేక కృత్యాలను చేయిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాజమహేంద్రవరానికి చెందిన సాదు జనార్ధనరావు మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో నడక, నడవడిక, పెద్దలతో వ్యవహరించాల్సిన తీరుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.సత్యనారాయణ, రిసోర్సుపర్సన్లు పి.భారతి, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు


సంక్షేమ పథకాల లబ్ధి వివరాల కరపత్రాన్ని స్థానిక మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఇలపల్లిపాకలులో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఇలపల్లిపాకలులో గురువారం ఆయన రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే తమకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లొల్ల భద్రం, ఎంపీటీసీ పొలినాటి సువర్ణలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధనాల రాంబాబు, అనుసూరి శ్రీను, జలెం చంటి, దుర్గాప్రసాద్, పోలినాటి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ల సేవలు అభినందనీయం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ కేతా తులసి తదితరులు

పెదపూడి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. కాండ్రేగుల, శహపురం, వేండ్ర గ్రామాల్లో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో గ్రామ వలంటీర్లను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి వారధులన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చందాళ్ల పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ గాజంగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌కు అభినందనలు


విజయభాస్కర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తాడి విజయభాస్కరరెడ్డిని నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. గురువారం మంగళగిరి చేరుకున్న అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్, పెదపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, పార్టీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తదితర నేతలు మంగళగిరిలోని ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు కార్యాలయంలో తాడి విజయభాస్కరరెడ్డిని కలుసుకుని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

ఉపాధి పనులపై నేడు సోషల్ ఆడిట్

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల స్థాయిలో శుక్రవారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి సంబంధిత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ బి.రామారావు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులపై ఈ నెల ఒకటి నుంచి 15 వరకూ సోషల్ ఆడిట్ జరిగిందన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అటల్ టింకరింగ్ ల్యాబ్ నైపుణ్య శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. నాలుగు రోజులుగా వీటిని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, అడిషనల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనం పంపిణీ


నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాతలు కొల్లూరి సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల సహకారంతో గురువారం నిరుపేదలకు గురువారం భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. 150 మంది నిరుపేదల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

పర్యావరణంపై అవగాహన

గోకవరం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలని అటవీ శాఖ మల్లవరం సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. మండలంలోని మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద, రైతుల పంట పొలాల వద్ద సర్పంచ్ యిడుదుల లక్ష్మి ఆధ్వర్యాన గ్రామస్తులకు, రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, సూదికొండ, మల్లవరం బీట్ అధికారులు డి.కామేశ్వరరావు, వై.రూస్సీరాణి, టి.రాజారమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన

బిక్కవోలు: మండలంలోని పందలపాక సచివాలయం, పంచాయతీ సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి వినియోగదారులకు విద్యుత్ ఆదాపై గురువారం అవగాహన కల్పించారు. విద్యుత్ ఆదా చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి వినియోగదారులతో విద్యుత్ ఆదాపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది బాబ్జి, సచివాలయ సిబ్బంది రంగారావు, సూరిశెట్టి సురేష్, వెలగల విజయలక్ష్మి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మిర్తిపాడు సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్లతో పాటుగా కోరుకొండ మండలం మధురపూడి అగ్రికల్చర్ సర్వీస్‌లకు విద్యుత్ ఉండదన్నారు.

రాజానగరం: దివాన్‌చెరువు, మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చేపట్టనున్న మరమ్మతుల్లో భాగంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దివాన్‌చెరువు, పాలచర్ల, శ్రీరామపురం, డీబీవీ రాజు కాంప్లెక్స్‌లలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ ఉండదు. అలాగే మల్లంపూడి, ముక్కినాడ, తోకాడ గ్రామాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు.

దాడి కేసు నమోదు

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన కొల్లి భాను ప్రకాష్‌పై దాడి చేసిన ఆకుల జయ, ఆకుల గణేష్‌పై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు గురువారం తెలిపారు. పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని భానుప్రకాష్‌పై అన్నదమ్ములైన జయ, గణేష్ బ్లేడ్‌తో దాడి చేశారన్నారు. గాయాల పాలైన భానుప్రకాష్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

17 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ సబ్జెక్టు పరీక్షలకు రెండోరోజు గురువారం 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సర పరీక్షకు మొత్తం 294 మంది హాజరుకావాల్సి ఉండగా 283 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 59 మంది హాజరుకావాల్సి ఉండగా 54 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీష తెలిపారు.

మహిళకు రిమాండ్

సీతానగరం: చినకొండేపూడి వేదాస్ ఆసుపత్రి నిర్వాహకురాలు మద్దుకూరి వరలక్ష్మికి కోర్టు రిమాండ్ విధించిందని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు గురువారం తెలిపారు. ఆసుపత్రి భవనం అద్దె చెల్లించాలని అడగటానికి వెళ్లిన వారిపై తప్పుడు కేసులు పెట్టడానికి చెయ్యి కోసుకుని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.